ఆధ్యాత్మిక అమృతవాహిని

# శ్రీ రామకృష్ణ ప్రభ

నవంబర్ 2014

వెల: ₹10






**శ్రీరామకృష్ణులు:** కెప్టెన్‌లో సుగుణాలు ఎన్నో ఉన్నాయి. కెప్టెన్ కర్మకాండను నిష్ఠతో ఆచరించే వ్యక్తి. అతడు ప్రతిరోజూ పూజ, హారతి, స్తోత్ర పఠనం, జపం మొదలైన నిత్యకర్మలు చేస్తూంటాడు. ఇంట్లో తానే స్వయంగా దేవతారాధన చేస్తుంటాడు. దేవతా ప్రతిమకు స్నానం చేయించేటప్పుడు ఎన్ని మంత్రాలు ఉచ్చరిస్తుంటాడనీ!

కానీ విషయమేమిటంటే... కెప్టెన్ రాత్రింబవళ్ళు ఐహిక కర్మల్లో మునిగి ఉంటాడు. నేను అతడి ఇంటికి వెళ్ళినప్పుడల్లా, అతడు భార్యాబిడ్డల నడుమ కూర్చొని ఉండడం చూస్తాను. అంతేకాకుండా జమా ఖర్చులు చూపించడానికని అతని గుమస్తాలు మధ్యమధ్యలో వస్తూ పోతూంటారు. కానీ అతడి మనస్సు అప్పుడప్పుడు భగవంతుడి వైపు కూడా మళ్ళుతూ ఉంటుంది. అది సన్నిపాత రోగి పరిస్థితి లాంటిది. సన్నిపాత రోగంతో ఒళ్ళెరగక పడివున్న వ్యక్తి అప్పుడప్పుడు కొద్దిగా స్పృహలోకి వచ్చి, 'మంచినీళ్ళు, మంచి నీళ్ళు' అని అరుస్తూంటాడు. కానీ మంచినీళ్ళు తెచ్చే లోపలే మళ్ళీ స్పృహ తప్పి పడిపోతాడు. అందుకనే నేను కెప్టెన్‌తో 'నువ్వు నిత్యకర్మలు అనుష్ఠించేవాడివి' అన్నాను. అతడు "అవునండి, పూజాది కర్మల ద్వారా నాకు ఎంతో ఆనందం కలుగుతుంది. మాబోటి జీవులకు కర్మకాండను మించి వేరే మార్గం లేదు" అన్నాడు.

నేను అతడితో ఇలా అన్నాను: కర్మలు ఎల్లకాలం చేస్తూనే ఉండాలా? తేనెటీగలు ఎంతసేపు ఝుంకారం చేస్తాయి? పువ్వులపై వ్రాలనంత వరకే! మధువును సేవించడం మొదలుపెట్టగానే ఆ ఝుంకారం ఆగిపోతుంది.

విషయాసక్తుడైన వ్యక్తి భగవంతుడికి చాలా దూరంగా ఉంటాడు. విషయాసక్తి కనుక లేనట్లయితే అతడికి భగవంతుడు అతి సమీపంలో ఉంటాడు. ❖

**శ్రీరామకృష్ణ ప్రభ**
రామకృష్ణ మఠం, దోమల్‌గూడ, హైదరాబాదు-500 029
ఫోన్: 040-27667799, సెల్: 8801849494
E-mail : sriramakrishnaprabha@gmail.com
నిర్వాహక సంపాదకులు: స్వామి జ్ఞానదానంద
సంపాదకులు: స్వామి పరిజ్ఞేయానంద

## లోపలి పేజీల్లో...


6 సంపాదకీయం
చిన్నారులు చిరుదివ్వెలు

8 గోరుముద్ద
నీ కన్నులు భయం లేదా?

9 దేవతల దీపావళి - కార్తీక పౌర్ణమి

10 పలికెడిది భాగవతం
మదిన్ చింతింపు ధాత్రీశ్వరా!

12 మన సంస్కృతి
వివిధ శాస్త్రాల విజ్ఞానం

14 పరిపూర్ణతకు మార్గం

15 నిన్ను తలచి నీ పేరు తలచి

16 పరిప్రశ్న

17 రామకృష్ణ భక్తి సూత్రాలు

18 జపం... మనోతపం

19 నేతి గారెలు నేర్పిన నీతి!

20 మనలో ఉండకూడనివి...

21 ధీరవాణి
ద్వేషించకండి! ప్రేమించండి!!

22 మానవజన్మ ముఖ్యోద్దేశ్యం

24 జీవితం ఓ మజిలీ

26 బోన్సాయ్ మొక్క

27 యువవాణి
99% శ్రమ

28 మన గెలుపు మాటున...

30 మధురగాయని మంచి మనస్సు

31 అధికార ప్రభావం

33 ముందుకు సాగిపో!

35 వికాస మంత్రాలు

36 భగవద్గీత - సద్గుణ సుధ
తెలియనివాడనై మెలిగితిన్...

37 జీవన వేదం - స్వామీజీ కథల సారం
స్థితప్రజ్ఞత! / సార్థకత!

38 బొమ్మల కథ
గురుదక్షిణ


ఈ సంచికలోని రచయిత(త్రు)ల అభిప్రాయాలు వ్యక్తిగతమైనవి. సంపాదకులు గానీ, హైదరాబాద్ రామకృష్ణ మఠం గానీ వాటికి బాధ్యత వహించజాలరు. - సంపాదకులు

### శ్రీరామకృష్ణ ప్రభ చందాదారులకు విన్నపం

ప్రియ పాఠకులారా!

- 'శ్రీరామకృష్ణ ప్రభ' పత్రిక కవరు మీద చిరునామాకు పైన మీ చందా నంబరు, కుడి వైపున మీ చందా గడువు ముగిసే నెల ఉంటాయి. మీ చందా గడువు పూర్తయ్యే నెలకు ముందుగానే సొమ్మును చెల్లించి చందాను పునరుద్ధరించుకోండి.
- మీ ఉత్తర ప్రత్యుత్తరాలన్నింటిలో తప్పనిసరిగా చందా నంబరు పేర్కొనాల్సిందిగా మనవి.
- మీ చిరునామా మారిన పక్షంలో 7వ తేదీ లోగా మాకు తెలియపరచినట్లయితే, వచ్చే నెల సంచిక నుండి మీ కొత్త చిరునామాకు పంపబడును.
- ప్రతీ నెల 26 లేదా 27వ తేదీల్లో పత్రిక పోస్ట్ అవుతుంది. మీకు పత్రిక 15వ తేదీ లోపుగా చేరనట్లయితే, వెంటనే మాకు తెలియజేయగలరు.

శ్రీరామకృష్ణ ప్రభ ద్వారా అవిచ్ఛిన్నంగా సేవలు అందించాలన్నదే మా ఆకాంక్ష. అందుకు మీ సహకారం కోరుతూ.... - సర్క్యులేషన్ మేనేజర్

**'శ్రీరామకృష్ణ ప్రభ'** పత్రిక చందాను ఆన్‌లైన్ **http://rkmath.org/srkp** ద్వారా చెల్లించవచ్చును.



# చిన్నారులు చిరుదివ్వెలు

ఈ లోకంలో తల్లితండ్రులకు ముఖ్యంగా మూడు విషయాల కారణంగా కష్టం కలుగుతుందని పంచతంత్రం చెబుతోంది.

**అజాత మృత మూర్ఖేభ్యో, మృతా జాతౌ సుతౌ వరమ్।**
**యతస్తౌ వల్ప దుఃఖాయా, యావజ్జీవం జడో దహేత్ ॥**

"పుత్రుడు పుట్టకపోవడం, పుట్టినవాడు మరణించడం, బ్రతికినవాడు మూర్ఖుడు కావడం – ఈ మూడూ తల్లితండ్రులకు దుఃఖాన్ని కలిగించే విషయాలు. అయితే ఈ మూడింటిలో మొదటి రెండు కారణాల వల్ల కలిగే దుఃఖం కొంతకాలమే ఉంటుంది. కానీ పుత్రుడు మూర్ఖుడిగా మారితే ఆ దుఃఖం తల్లితండ్రులను జీవితాంతం వేధిస్తుంది."

అయితే, తల్లితండ్రులు తమ పిల్లల్ని ప్రయోజకులుగా తీర్చిదిద్దాలంటే ఏం చేయాలి? సచ్ఛీలురుగా, ఉన్నతులుగా మలచాలంటే ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

ఒక గది అంతా వెలుగుతో నిండాలంటే ఓ చిరు దీపాన్ని వెలిగిస్తే చాలు. అంతేగానీ, గది పరిమాణం ఎంత ఉందో అంత దీపాన్ని వెలిగించనవసరం లేదు కదా! అలాగే చిన్నారులు జీవితాంతం సద్గుణ వంతులుగా జీవించాలంటే మహాత్ముల త్యాగమయ జీవిత విశేషాలతో, స్ఫూర్తివచనాలతో, సద్బోధలతో వారి హృదయ దీపాలను వెలిగించాలి. ఆ స్ఫూర్తికిర ణాలు చిన్నారుల జీవితాలను తేజోవంతం చేస్తాయి.

హితోక్తులతో, ధీరవచనాలతో తమ పిల్లల శీలనిర్మాణానికి తోడ్పడిన మాతాపితరులు ఎంతోమంది మన చరిత్రపుటల్లో స్థానాన్ని సంపాదించుకున్నారు. అలాంటి ఆదర్శ మాతాపితరుల అడుగుజాడలను అనుసరిస్తే చిన్నారులంతా మహోన్నతులుగా తయారవుతారు.

**మాతృమూర్తులకు మార్గదర్శి మదాలస:** పూర్వం ఋతధ్వజుడు అనే మహారాజు ఉండేవాడు. అతడికి మదాలసతో వివాహం జరిగింది. ఋతధ్వజుడు మహా పరాక్రమవంతుడు. మదాలస ఆత్మతత్త్వం తెలిసిన జ్ఞానవంతురాలు. మదాలస తమకు పుట్టిన ప్రతి బిడ్డనూ ఊయల్లో వేసి 'శుద్ధోఽసి, బుద్ధోఽసి, నిరంజనోఽసి – నీవు శుద్ధుడవు, నీవు జ్ఞానివి, నీవు నిర్మలుడవు' అంటూ జోలపాట పాడుతూ ఉండేది. ఈ విధంగా పుట్టిన ముగ్గురు బిడ్డలకూ ఆత్మబోధ చేసింది మదాలస. ఆ ముగ్గురు పుత్రులూ ప్రాపంచిక సుఖాలను త్యజించి, ఆత్మసాక్షాత్కారం కోసం తపస్సు చేసుకోవాలని అరణ్యాలకు వెళ్ళిపోయారు. అప్పుడు ఋతధ్వజ మహారాజు 'పుట్టిన ప్రతీ పుత్రుడు తపస్సుకై అరణ్యాలకు వెళ్ళిపోతున్నాడు. రాజ్యభారాన్ని వహించడానికీ, వంశాన్ని కొనసాగించడానికీ ఒక్క కుమారుడనైనా తీర్చిదిద్దు' అని మదాలసతో అంటాడు.

అప్పుడు మదాలస తమకు కలిగిన నాలుగో కుమారుడైన అలర్కుణ్ణి ఊయలలో పడుకోబెట్టి "నాయనా! నీ వంశ ప్రతిష్ఠను నిలబెట్టేలా జీవించు; ఎల్లప్పుడూ సత్కర్మలు చేయి; పరస్త్రీలను మాతృమూర్తుల్లా, పరధనాన్ని మట్టిబెడ్డలా భావించు; పరోప కారమే పరమధర్మంగా జీవించు; ప్రజలు సుఖసంతోషాలతో



జీవించేలా రాజ్యాన్ని పరిపాలించు; పెద్దల పట్ల వినయ విధేయతలతో ప్రవర్తించు; అహంకార మమకారాలకు లోబడకు..." – ఇలా ఉన్నత వ్యక్తిత్వానికి అవసరమైన సద్గుణాలను వల్లిస్తూ జోల పాడుతూ ఉండేది. అలా తల్లి సద్బోధ క్షీరపానంతో పెరిగిన అలర్కుడు రాజ్యభారాన్ని స్వీకరించాడు. ప్రజలను ప్రేమతో పరిపాలించసాగాడు. కామ క్రోధ లోభాలకు వశమవకుండా ఉన్నతంగా జీవించ సాగాడు. జీవితంలో ప్రలోభాలు ఎదురైనప్పుడు బాల్యంలో తల్లి చేసిన సద్బోధలు అతణ్ణి సన్మార్గంలో నడిపించసాగాయి. అలర్కుడు ఉన్నత విలువలతో జీవించి చివరికి రాజ్యభారాన్ని తన కుమారునికి అప్పగించి, తపోమయ జీవనం గడపడానికి అరణ్యాలకు వెళ్ళిపోయాడు.

మదాలస పసిబిడ్డకు జోలపాట పాడుతూనే నైతిక విలువలను బోధించింది. బాల్యంలో తల్లి చేసిన ఆ సద్బోధ అలర్కుణ్ణి శీలవంతునిగా తీర్చిదిద్దింది.

**ఆధునిక యుగంలో ఆచరణీయమా?:** "మదాలస జీవించిన దేశ కాల పరిస్థితులు వేరు. నేటి సమాజ స్థితిగతులు వేరు. అలాంటప్పుడు మదాలస అడుగుజాడల్ని అనుసరించడం ఆధునిక తరానికి ఎలా సాధ్యమవుతుంది?" అనే సందేహం వస్తుంది. పిల్లల్ని శీలవంతులుగా తీర్చిదిద్దాలన్న సంకల్పం, సహనం, సౌశీల్యం తల్లితండ్రులకుంటే ఏ తరం వారికైనా మదాలస జీవితం అనుసరణీయమే! నేటి తరంలో కూడా ఎంతో మంది తల్లితండ్రులు ఆదర్శవంతంగా జీవిస్తూ, తమ పిల్లల శీలనిర్మాణంలో ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు.

మదాలస, ఋతధ్వజుల జీవన వృత్తాంతం కొన్ని వేల సంవత్సరాల క్రితం జరిగింది. కానీ కొన్ని సంవత్సరాలు, కొన్ని నెలల క్రితం జరిగిన రెండు సంఘటనలను తెలుసుకుంటే ఈ ఆధునిక యుగంలో కూడా తమ పిల్లల్ని ఉన్నతులుగా తీర్చిదిద్దే తల్లితండ్రులు ఉన్నారని తెలుస్తుంది.

లాల్‌జీగా అందరూ పిలుచుకొనే శ్రీచిమన్‌లాల్ శీతల్‌వాడ్ బొంబాయి విశ్వవిద్యాలయానికి ఉప కులపతిగా బాధ్యతలను నిర్వహించారు. లాల్‌జీ ఉప కులపతిగా నియమితులు కాకముందు న్యాయ మూర్తిగా పనిచేసేవారు. ఒకసారి ఒక నేరస్థుడు లాల్‌జీ దగ్గరకు వచ్చి 'నాకు అనుకూలంగా తీర్పు చెబితే, లక్ష రూపాయలు ఇస్తాన'ని ప్రలోభపరిచాడు. అందుకు లాల్‌జీ అంగీకరించలేదు.

అప్పుడు అతడు లాల్‌జీతో, 'సార్! మీకు ఇంత పెద్ద మొత్తాన్ని ఇచ్చేవాడు ఇంకొకడు దొరకడు' అని గర్వంగా చెప్పాడు. అందుకు బదులుగా లాల్‌జీ 'ఇంత పెద్ద మొత్తం ఇచ్చేవాళ్ళు చాలా మంది ఉండవచ్చు. కానీ ఇంత పెద్ద మొత్తాన్ని తిరస్కరించే వ్యక్తి మీకు ఇంకొకరు దొరకడం కష్టం' అని చిరునవ్వుతో సమాధానమిచ్చారు. 'మీరు ఉన్నత వ్యక్తిగా ఎదగడానికి ప్రేరణ ఏమిట'ని లాల్‌జీని అడిగితే 'మనిషికి గౌరవాన్ని తెచ్చిపెట్టేవి ఉన్నత విద్య, అధికారం, సంపదలు కావు. సచ్ఛీలమే శాశ్వత కీర్తిని ఆర్జించిపెట్టేది – అని బాల్యంలో మా తండ్రి నూరిపోసిన నీతివాక్యాలే' అని చెప్పేవారు.

అలాగే, రెండు నెలల క్రితం హైదరాబాద్‌లో ముగ్గురు యువకులు తమ స్నేహితుడికి పుట్టినరోజు కానుక కొనడానికి రెండు వందల రూపాయలు తీసుకోవడం కోసం ఒక ఏ.టి.యమ్.కు వెళ్ళారు. అక్కడ ఏ.టి.యమ్. యంత్రం తెరుచు కొని, కట్టలుగా పడివున్న దాదాపు 25 లక్షల రూపాయల నగదును చూశారు. కేవలం 200 రూపాయల కోసం వెళ్ళిన ఆ యువకులకు 25 లక్షల రూపాయల నగదు కనిపించగానే కళ్ళు చెదిరాయి. కానీ మనస్సు మాత్రం చలించలేదు. అందుకే వారు పోలీసుస్టేషన్‌కు విషయాన్ని తెలియజేశారు. పోలీసు అధికారులు, బ్యాంక్ అధికారులు అక్కడకు వచ్చి నగదును స్వాధీనపరచుకొనే దాకా అక్కడే ఆ ఏ.టి.యమ్.కూ, ఆ డబ్బుకూ కాపలాగా నిలుచున్నారు. అధికారులు ఆ యువమిత్రుల నీతి నిజాయతీలకు మెచ్చుకొని, వాళ్ళను సన్మానించారు. ఇంతకీ ఆ ముగ్గురు మిత్రులు జీవితంలో ఇంకా స్థిరపడనివారే! ఒక యువకుడు ఉద్యోగ ప్రయత్నం చేస్తున్నాడు. రెండో యువకుడు చిరుద్యోగం చేస్తూ పోటీ పరీక్షలకు తయారవుతున్నాడు. మూడో యువకుడు చిరుద్యోగం చేస్తూ చదువుకుంటున్నాడు. ఈ కాలంలో కూడా ఇంత నిజాయతీగా ఉండడానికి మీలో ఆ నైతికబలం ఎలా వచ్చిందని ప్రశ్నిస్తే 'మా తల్లితండ్రులు మాకు నేర్పిన నైతిక విలువల పుణ్యమే' అని ఆ ముగ్గురూ ముక్తకంఠంతో తమ తమ తల్లితండ్రులను కొనియాడారు.



## కోపం వద్దు... ప్రేమే ముద్దు

**అమెరికా ప్రథమ అధ్యక్షుడైన జార్జ్ వాషింగ్‌టన్ ఒక రైతు కుటుంబంలో జన్మించాడు. అతడు చిన్నతనంలో తండ్రితో పాటు పొలానికి వెళుతూ ఉండేవాడు. ఒకరోజు పొలం పని పూర్తిచేసుకొని తండ్రి ఓ చెట్టు క్రింద విశ్రాంతి తీసుకుంటున్నాడు. ఆ సమయంలో వాషింగ్‌టన్ అక్కడ ఉన్న గొడ్డలిని తీసుకొని పళ్ళ చెట్టును నరికేశాడు.**

**తండ్రి జరిగినదంతా గమనించాడు. తాను ఎంతో కాలంగా పెంచిన పళ్ళ చెట్టును కొడుకు నరికినందుకు అతడికి కోపం వచ్చింది. కానీ అతడు కోపాన్ని అణచుకొని జార్జ్‌తో "చూడు నాయనా! ఈ చెట్టు తన పండ్లతో మన ఆకలిని తీరుస్తుంది. మనకు మేలుచేసే వాటికి ఎన్నడూ కీడు తలపెట్టకూడదు" అని ప్రేమతో సున్నితంగా చెప్పాడు.**

**అమెరికా దేశాధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహిస్తున్నప్పుడు కూడా 'బాల్యంలో తండ్రి చెప్పిన మాటలు నన్ను ఎంతగానో ప్రభావితం చేశాయి' అని వాషింగ్‌టన్ గుర్తుకు తెచ్చుకునేవారు. దేశ ప్రజల సంక్షేమం కోసం నిజాయతీగా సేవలందించి చరిత్రలో చిరస్మరణీయుడిగా నిలిచారు.**

ఈ సంఘటనలను తెలుసుకున్న తరువాత పిల్లల్ని సచ్ఛీలు రుగా మార్చడంలో తల్లితండ్రులదే ప్రధానపాత్ర అనీ, ఈ ఆధునిక యుగంలో కూడా అది సాధ్యమేననీ అంగీకరించక తప్పదు. నేటి సమాజంలో మనిషి వ్యక్తిత్వం ఎలా ఉన్నప్పటికీ పట్టాలు, పదవులు, సంపదలు ఉంటే ఆ వ్యక్తి ఉన్నతుడనే భావన ప్రబలింది.

అందుకే అబ్రహామ్ లింకన్ సచ్ఛీలత ప్రాధాన్యాన్ని వివరిస్తూ... *"Character is like a tree and reputation its shadow. We give importance to the shadow and forget the tree* - సచ్ఛీలం ఒక చెట్టు అయితే, ఖ్యాతి దాని నీడ లాంటిది. మనం నీడ లాంటి ఖ్యాతికి ప్రాధాన్యమిస్తూ, చెట్టు లాంటి సచ్ఛీలతను విస్మరిస్తున్నాం" అని గుర్తుచేశారు. కాబట్టి 'మనిషికి శాశ్వత కీర్తిని ఆర్జించిపెట్టేది సచ్ఛీలమే!' అన్న స్ఫూర్తి వచనాలతో చిరు హృదయాలను ప్రకాశింపజేయాలి. అందుకు అందరూ దృఢ సంకల్పంతో ముందుకు సాగాలి. ❖

**తల్లిలాంటి దైవం లేదు. తండ్రిలాంటి గురువు ఉండడు. భూమి మీద ఏ ప్రాణికైనా తల్లిని మించిన బంధువు లేదు. కాబట్టి తల్లి తండ్రులను గౌరవించని పుత్రునికి శ్రేయస్సు కలుగదు.** -సుభాషితం

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Sri+Ramakrishna+Prabha+November+2014**

* * *